
బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 15 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


వివరాలు 3వ పేజీలో

## ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి

- సమాజ శ్రేయస్సును నిర్ణయించడంలో సంస్థల పాత్రపై చేసిన అధ్యయనానికి గానూ ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్

## గ్రామీణ రోడ్లకు మహర్దశ

- 92 నియోజకవర్గాల్లో పనులకు సర్కార్ గ్రీన్ సిగ్నల్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ పట్టింది. రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులను మంజూరు చేసింది. 92 నియోజకవర్గాల్లో 641 పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఇవాళ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గ్రామాల్లో1,323 కి.మీ మేర కొత్త రహదారుల నిర్మాణ పనుల కోసం రూ.1,377.66 కోట్లను రిలీజ్ చేసింది. మరోవైపు రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడంపై సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క థ్యాంక్స్ చెప్పారు. అవసరాన్ని, అవకాశాన్ని బట్టి మరిన్ని నిధులు విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. సీఆర్ఆర్ రోడ్ల కోసం మరో రెండు, మూడు రోజుల్లోనే రూ. 400 కోట్ల మేర నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.



## రూ. వెయ్యి కోట్లు తాగేశారు..!


- తెలంగాణలో రూ. 1100 కోట్లు దాటిన దసరా మద్యం అమ్మకాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దసరా పండుగ నేపథ్యంలో తెలంగాణలో మద్యం అమ్మకాలు భరీగా పెరిగాయి. రాష్ట్రంలో దసరా మద్యం అమ్మకాలు రూ. 1100 కోట్లు దాటాయి. ఈ నెల 11న ఒక్కరోజే రూ.200.44 కోట్లు, 10న రూ.152 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. అక్టోబర్ 1 నుంచి 10 వరకు రూ.852.40 కోట్ల విలువైన మందు అమ్ముడైనట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. బార్లు, మద్యం దుకాణాలతో పాటుగా పబ్ లలోనూ అమ్మకాలు పెరిగాయి. దీంతో సర్కార్ ఖజానాకు.. మద్యం భారీగా ఆదాయం తెచ్చి పెట్టింది. మద్యం అమ్మకాల్లో ఎప్పటిలాగే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది.

రాష్ట్రంలో 2 వేల 260 మద్యం దుకాణాలు, 1,171బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. వీటితో పాటుగా పబ్బుల్లోనూ మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. దసరాకు ముందు నుంచే మొదలైన మద్యం కిక్కు శని, ఆదివారాల్లో పీక్స్‌కు చేరింది. సెప్టెంబర్ 30 వరకు 2 వేల 838 కోట్ల అమ్మకాలు జరగ్గా అక్టోబర్ నెల ప్రారంభం నుంచి 11వ తేదీ వరకు రూ 1,100 కోట్ల మేర విలువైన 10 లక్షల 44వేల కేసుల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. 10 రోజులవ్యవధిలోనే 17 లక్షల 59 వేల బీర్లు అమ్ముడుపోయాయట. మద్యం అమ్మకాల్లో ఉమ్మడి రంగారెడ్డి టాప్‌లో ఉండగా ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, వరంగల్ జిల్లాలు తర్వాతి మూడు స్థానాల్లో ఉన్నాయి.

## కంపెనీలకు మౌలిక సదుపాయాలపై అనుమానాలు అక్కర్లేదు




- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే కంపెనీలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కరలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో కలిసి ముఖ్యమంత్రి హైదరాబాద్ శివారు కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీని సందర్శించారు.ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో సమావేశమై కంపెనీ పురోగతి, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ఫాక్స్‌కాన్ ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ సీఈవో, చైర్మన్ సిడ్నీ ల్యూ గారితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పించడంలో అన్ని విధాలుగా సహకరిస్తామని మరోసారి భరోసా ఇచ్చారు.కంపెనీ విస్తరణలో భాగంగా తెలంగాణలో మరిన్ని విభాగాల్లో పెట్టుబ డులకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. సీఎం పర్యటన సందర్భంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి , ప్రభుత్వ ఐటీ విభాగం ఉన్నతాధికారులు, ఫాక్స్‌కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## శబరిమల స్పాట్ బుకింగ్ రద్దు

- తీవ్ర విమర్శలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




ఎశబరిమల అయ్యప్ప దర్శనం కోసం వచ్చే భక్తులు స్పాట్ బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని నిలిపివేస్తూ కేరళ సర్కార్ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. తీర్థయాత్రల సీజన్‌లో భక్తులకు అంతరాయం కలగకుండా స్పాట్ బుకింగ్‌లను పునరుద్ధరించాలనే డిమాండ్‌లు పెరుగుతున్నాయి. అలాగే అధికార పార్టీ సీపీఐ(ఎం) మిత్రపక్షాలు కూడా స్పాట్ బుకింగ్స్‌పై ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కోరుతున్నాయి.శబరిమలలో అయ్యప్ప భక్తుల కోసం ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఆన్‌లైన్ విధానంతో పాటు స్పాట్ బుకింగ్స్‌ను తిరిగి తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం ప్రభుత్వాన్ని కోరారు. ఈ పరిస్థితిని రాజకీయ లబ్ది కోసం ఆర్ఎస్ఎస్ ఉపయోగించుకోవడానికి వీలు కల్పించొద్దని విజ్ఞప్తి చేశారు. విశ్వాసం ముసుగులో భక్తులను తప్పుదోవ పట్టించడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివాదాన్ని రెచ్చగొట్టడానికి చాలా మంది ప్రయత్నిస్తారని ఆయన అన్నారు. "వర్చువల్ బుకింగ్‌తో పాటు భక్తులందరి సౌకర్యార్థం స్పాట్ బుకింగ్‌ను కూడా ప్రభుత్వం తీసుకురావాలి. అయ్యప్ప భక్తులు దీక్షలు చేసి దర్శనం చేసుకోకుండా తిరిగి వెళ్లే పరిస్థితి వస్తే ఆర్ఎస్ఎస్ దాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తోంది" అని బినోయ్ విశ్వం విమర్శించారు.

## వికలాంగుల జాబ్ పోర్టల్ ఏర్పాటు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వం వికలాంగుల జాబ్ పోర్టల్ ను ఏర్పాటు చేసింది. దివ్యాంగులు ఆఫీసర్ల చుట్టూ తిరిగే పనిలేకుండా నేరుగా జాబ్ పోర్టల్ లో అప్లై చేసుకుంటే చాలని, వారి అర్హతను బట్టి ఉద్యోగం ఉంటుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శుభవార్త చెప్పారు. సచివాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల జాబ్ పోర్టల్ ను ఆవిష్కరించారు. మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరెట్ హెల్ప్ లైన్ లో పదిమందికి అపాయింట్మెంట్ ఆర్డర్లు అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఉపాధి రంగాల్లో దివ్యాంగులకు అవకాశాలు తక్కువ అన్నారు. ఇతర వర్గాల వర్గాల వారిలా ఫైట్ చేయాలంటే ఎన్నో అవరోధాలు ఎదుర్కొవలసి ఉంటుందన్నారు. శారీరకంగా వచ్చే లోపం మన చేతిలో లేదన్నారు. పోషకాహార లోపం, ప్రమాదం వల్ల వికలాంగులుగా మారే ప్రమాదం వుందన్నారు. అందుకే వాళ్లకి ఉపాది అవకాశాలు కల్పించేందుకు ఆన్లైన్ జాబ్ పోర్టల్ ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ఉద్యోగాల్లో వికలాంగులకు రిజర్వేషన్లు పాటించాలని తెలిపారు.



## కేటీఆర్ పిటిషన్‌పై విచారణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మంత్రి కొండా సురేఖపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావా పిటిషన్‌పై నాంపల్లి స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో కెటిఆర్ తరపున లాయర్ ఉమామహేశ్వర్‌రావు వాదనలు విని పిం చారు. కేసులో ఇరు వర్గాల వాదనలు విన్న ధర్మాసనం ఈ నెల 18వ తేదీన కెటిఆర్‌తో పాటు ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్న సాక్షుల స్టేట్ మెం ట్‌లను రికార్డ్ చేస్తామని వెల్లడించింది. అనంతరం కేసును 18వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. దీనిపై ఈ నెల 10వ తేదీన కోర్టు లో పిటిషన్ దాఖలు చేశారు. 2014-2023 వరకూ ముఖ్యమంత్రి కెసిఆర్ కేబినెట్‌లో మంత్రిగా పని చేశానని, 5 సార్లు వరుసగా సిరిసిల్ల నియోజకవర్గానికి ఎంఎల్ఎగా ఉన్నానని, 9 ఏళ్లు మంత్రిగా పనిచేశానని, ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీకి వర్కిం గ్ ప్రెసిడెంట్‌గా ఉన్నానని కెటిఆర్ సదరు పిటిషన్‌లో పేర్కొన్నారు.సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉన్నానని, మంత్రిగా రాష్ట్రాన్ని అభి వృద్ధి చేశానన్నారు. ప్రపంచంలోని బహుళ జాతి సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా పనిచేశానని, తెలంగాణా వేగంగా అభివృద్ధి చెందడంలో కృషి చేశానన్నారు. మంత్రి కొండా సురేఖ వాఖ్యలు తన పరువుకు తీవ్ర నష్టం చేకూర్చాయంటూ ఆమె మాట్లాడిన వీడియో, ఆడియో టేపులను, బిఎన్ఎస్ యాక్ట్ 356 సెక్షన్ కింద చట్ట పరమైన చర్యలు


మిగితా 3వ పేజీలో



## గాంధీ మెడికల్ కళాశాలకు సాయిబాబాకు భౌతికకాయం

- ప్రజా సంఘాల అశ్రు నివాళి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, మానవ హక్కుల ఉద్యమ నేత జిఎన్ సాయిబాబాకు పౌరసమాజం నివాళులర్పించింది. సాయిబాబా భౌతికదేహాన్ని సోమవారం ఉదయం నిమ్స్ ఆస్పత్రి నుంచి గన్‌పార్క్ వద్దకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి మౌలాలీలోని ఆయన నివాసానికి తరలించారు. అక్కడే సంస్మరణ సభ నిర్వహించారు. సాయిబాబాను కడసారిగా చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా గడ్చిరోలి, ఒడిశా, ఢిల్లీ, బెంగాల్ రాష్ట్రాల నుంచి అభిమానులు తరలివచ్చారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు, రైతు సంఘం నాయకులు సాయిబాబాకు జోహార్లు అర్పించారు. అనంతరం సికాంద్రాబాద్ బోయగూడ చౌరస్తా నుంచి గాంధీ ఆస్పత్రి వరకు అంతిమయాత్ర నిర్వహించారు. గాంధీ మెడికల్ కళాశాలకు భౌతికకాయాన్ని అప్పగించారు.

సాయిబాబా మృతి ప్రజాస్వామ్యానికి తీరని లోటని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మురళీధరన్ అన్నారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులతో కలిసి సాయిబాబాకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. అట్టడుగు వర్గాల ప్రజల కోసం చివరి వరకు రాజీపడకుండా పోరాడారని కొనియాడారు. ఎన్ఐఎ లాంటి సంస్థలను పావులుగా వాడి హక్కుల ఉద్యమ నేతలపై అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. సాయిబాబాది సహజ మరణం కాదనీ, కేంద్ర ప్రభుత్వ

మిగితా 3వ పేజీలో

## గ్రూప్-1 మెయిన్ హాల్‌టికెట్ల విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గ్రూప్-1 మెయిన్స్ హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు టీజీపీఎస్సీ రిజిస్ట్రేషన్ ఐడీ నంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేసి హాల్‌టికెట్లను పొందవచ్చని వెల్లడించింది. ఈ నెల 21 నుంచి 27 వరకు జరుగనున్న మెయిన్స్‌కు 31,382 మంది హాజరుకానున్నారు.

## సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వంసం








**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించి విగ్రహం ధ్వంసం చేశారు. విషయం పసిగట్టిన స్థానికులు దుండగులను పట్టుకునే ప్రయత్నం చేశారు.. నిందితుల్లో ఒకరిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. విషయం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. ఎలాంటి గొడవలు జరగకుండా కట్టుదిట్టం చేశారు. పట్టుబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలంటూ హిందూ సంఘాలు ఆందోళన చేపట్టాయి. బీజేపీ కార్పొరేటర్లు, వీహెచ్‌పీ, భజరంగదళ్ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగాయి. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే గణేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు

మిగితా 3వ పేజీలో

## చార్జీలు పెంచలేదు

- టీజీఆర్టీసీ ఎండి విసి సజ్జనార్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో టీజీఎస్ఆర్టీసీ విపరీతంగా టికెట్ ధరలు పెంచిందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని టిజిఎస్ఆర్‌టిసి ఎండి విసి సజ్జన్నార్ తెలిపారు. జీవో ప్రకారం స్పెషల్ బస్సుల్లో మాత్రమే చార్జీలను సంస్థ సవరించిందని, రెగ్యులర్ సర్వీస్‌లలో టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. ఎక్స్ వేదికగా సజ్జన్నార్ సోమవారం సుధీర్ఘ వివరణతో కూడిన ట్వీట్ చేశారు. "ప్రధాన పండుగులైన సంక్రాంతి, దసరా, రాఖీ పౌర్ణమి, వినాయక చవితి, ఉగాది, తదితర సమయాల్లో హైదరాబాద్ నుంచి ప్రయాణికులు ఎక్కువగా సొంతూళ్లకు వెళ్తుంటారు. ఈ సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతుంది.రద్దీ మేరకు హైదరాబాద్ సిటీ బస్సులను కూడా జిల్లాలకు తిప్పుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రయాణికుల రద్దీ ఉండక పోవడంతో ఖాళీగా ఆ బస్సులు వెళ్తుంటాయి. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగల సమయాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.50 వరకు టికెట్ ధరను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ఆర్టీసీ బస్సుల్లో 25 శాతం మేర రద్దీ పెరిగింది. గతంతో పోల్చితే సంక్రాంతి, రాఖీ పౌర్ణమి, తదితర పండుగలకు బస్సుల్లో ప్రయాణాలు పెరిగాయి. ఆయా సమయాల్లో ఒకవైపే రద్దీ ఎక్కువగా ఉంటోంది. తిరుగు ప్రయాణంలో బస్సులన్నీ ఖాళీగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయా పండుగుల్లో నడిచే స్పెషల్ బస్సులకు చార్జీలను జీవో ప్రకారం సవరించడం జరుగుతోంది" అని సజ్జన్నార్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

టీజీఎస్ఆర్టీసీలో ప్రస్తుతం 9 వేలకు పైగా బస్సులు సేవలందిస్తున్నాయని, పండుగ సమయాల్లో రద్దీకి అనుగుణంగా ప్రతి రోజు సగటున 500 స్పెషల్ బస్సులను సంస్థ నడుపుతుందని తెలిపారు. ఆ 500 స్పెషల్ బస్సుల్లో మాత్రమే చార్జీల సవరణ ఉంటుందని, మిగతా 8,500 రెగ్యులర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని వివరించారు. పండుగ సమయాల్లో రెగ్యులర్, స్పెషల్ సర్వీసుల్లో టికెట్ ధరల్లో తేడాలుండటం

మిగితా 3వ పేజీలో

## కరవమంటే కప్పకు కోపం..

# విడవమంటే పాముకు కోపం...




## అలా ఉంది.. తెలంగాణ పోలీసుల దుస్థితి..!

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

అధికార పార్టీలో ఉండి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన అధికారపార్టీ లీడర్లే.. గ్రూపు రాజకీయాలతో బజారుకెక్కుతున్నారు.అత్త మీద కోపం దుత్త మీద తీసినట్లు.. పోలీసులపై విరుచుకుపడుతున్నారు. వారి విధులు వారు సక్రమంగా నిర్వహించకుండా అడ్డుతగులుతున్నారు.ముందుగా వరంగల్ జిల్లా గీసుకొండ పోలీసులకు అభినందనలు.. ఒక ఘర్షణ జరిగినప్పుడు.. పార్టీలతో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులనే అదుపులోకి తీసుకోవడం హర్షనీయం. రాష్ట్రంలో శాంతిభద్రతలు ముఖ్యం.

ఒక మంత్రి పోలీస్ స్టేషన్ మెట్లు తొక్కించారంటే మాములు విషయం కాదు. ఈ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో పోస్టింగ్ ఉంటుందో.. ఊడుతుందో తర్వాత విషయం కానీ.. పోలీసులు ఇలానే విధులు నిర్వహించాలి. చట్ట పరిధి లో ఎవరు తప్పు చేస్తే వారిపై కేసులు నమోదు చేసి లోపల వేయాలి.

మంత్రులు, ఎమ్మెల్యేలు అని చూసుకుంటు పోతే.. చట్ట పర చర్యలు తీసుకోకపోతే ప్రాణ నష్టం జరిగే అవకాశాలు కూడా ఉంటాయి. పోలీస్ ఉద్యోగం ఇక్కడ కాకపోతే ఇంకో చోటే చేయ్యోచ్చు.. కానీ మంత్రులు, ఎమ్మెల్యేల మాటకు తలొగ్గి అల్లర్లు చేస్తున్న వారిపై, ఘర్షణలకు కారణమవుతున్న వారిపై చర్యలకు వెనకడుకు వేస్తే.. అల్లర్లు చెలరేగి.. శాంతిభద్రతలు కాపాడలేని సత్తా లేని పోలీసు అధికారులుగా మిగిలిపోతారు. ఒక సంఘటన జరిగిన తర్వాత పై అధికారులు కూడా క్షమించరు.. సస్పెన్షన్లు, చార్జ్ మెమోలు.. కోర్టులు, కేసులు అనేక రకాలుగా పోలీసు అధికారులు ఇబ్బందుల పడాల్సి వస్తుంది. మనస్సు చంపు కోని మాత్రం పోలీసు అధికారులు ఉద్యోగాలు చేయ్యోద్దు.

గతంలో బీఆర్ఎస్ సర్కార్ హాయంలో ఎమ్మెల్యేలు కొంత మంది పోలీసులను అతిగా ఉపయోగించుకోని ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకోని ఓటమిపాలయ్యారు. పోలీసును చట్టవిరుద్ధమైన పనులకు రాజకీయ నాయకులు ఉపయోగించిన వారు రాజకీయంగా ఎటుకాకుండా పోయిన సంఘటనలు అనేకం చూస్తున్నాం. ప్రస్తుతం వీరికి హెూంగార్డు కూడా సలాం కొట్టడం లేదు కొంత మంది ఎమ్మెల్యేలకు.

పోలీసులకు కాస్తా స్వేచ్ఛ ఇచ్చి.. వారి పని వారిని చేయించుకోనిస్తేనే శాంతిభద్రతలు భద్రంగా ఉంటాయి. లేకపోతే సర్కారు కు సైతం చెడ్డ పేరు వస్తుంది.

మంత్రి స్థాయి కొండా సురేఖ ప్రవర్తన రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగా చెడ్డపేరు రావడమే కాదు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన మీద, మంత్రుల



పనితీరుపై కూడా పర్యవేక్షణ లేదా ...? అనే విమర్శలు వస్తున్నాయి. మంత్రులు ఇష్టానుసారంగా వ్యవహరించిన ఏం అనోద్దు.. క్రమశిక్షణ చర్యలు తీసుకోవద్దు అని ఢీల్లి పెద్దలు ఏమైన చెబుతున్నారా..? ముఖ్యమంత్రి చేతిలో రాష్ట్ర పాలనను, సొంత పార్టీ నాయకులను అదుపులో పెట్టుకోనే అధికారం కూడా లేకుండా చేశారా..? సిని నిటి సమంత విషయంలో మంత్రి కొండా సురేఖ గారి వాఖ్యలు రాష్ట్రంలో గడప గడప చర్చించుకోని మంత్రి తీరును తీవ్రంగా విమర్శించారు. క్షమాపణలు చెప్పి.. సర్కారు తలదించుకునే పరిస్థితి తెచ్చింది. మళ్లీ ఏకంగా ఒక మంత్రి తన వాళ్లను ఎందుకు అదుపులోకి తీసుకున్నారు అని ఒక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. ఏకంగా ఎస్‌హెచ్‌వో సీట్లో కూర్చోని అధికారులను నిలదీయడం బాధాకరం. మంత్రి హెూదాలో ఏదో ఒక అధికారిక కార్యక్రమాలో హజరై కూర్చుంటే ఎవరు పట్టించుకోరు.. కానీ నిందితుల తరుపున మంత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చి సీఐ సీట్లో కూర్చోని దిశానిర్దేశం చేసే బదులు పోలీసు విధులు కూడా ఎమ్మెల్యేలు, మంత్రులే నిర్వహిస్తే బాగుంటుంది కదా..?

కాంగ్రెస్ సర్కార్ వచ్చాక కొంత మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలుగా ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులు మరి అతి చేస్తున్నారు. ప్రజలపై, సామాజిక వర్గాలపై నోరు జారుతు కాంగ్రెస్ సర్కార్ పరువు తీస్తున్నారు. చెప్పిన పని చేయడం లేదు.. తాము సూచించిన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలంటే చేయడం లేదనే అక్కసుతో.. పోలీసు అధికారులను బదిలీలు చేయించడం, అనుకూలమైన పోలీస్ అధికారులను పోస్టింగులు ఇచ్చి తెచ్చుకోవడం చేస్తున్నారని వినికిడి. ఏకంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కూడా బదిలీలు చేయించి.. తమ అమ్యాయాల కౌంటర్లు ప్రారంభించాలని చూస్తున్నారని తెలుస్తోంది.

ఫలానా ఎస్పీ మాకోద్దు, ఫలానా సీపీ మాకోద్దు.. బీఆర్ఎస్ హాయాంలో పని చేశాడు.. అని కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తూ..వారిని బదిలీలు చేయడాలని కాళ్లవేళ్లా పడుతున్నారని సమాచారం. కానీ ఆ ఎస్పీ ఏం తప్పు చేశాడు.. ఏం అవినీతి ఆరోపణలు ఏమైన ఉన్నాయా..? శాంతిభద్రతలు కాపాడటం లేదా..? అనే విషయాలే చర్చించడం లేదు. ప్రస్తుతం పలు జిల్లాల్లో పోలీసులను సుంకరులుగా ఉపయోగించుకోని తమ రాజకీయపబ్బం, రాజకీయ కక్షలు తీర్చుకునేందుకు నిజాయితి గల పోలీసు అధికారులను బదిలీలు చేస్తూ.. లేని పోని ఆరోపణలు చేస్తూ.. ఐపీఎస్‌లను సైతం బదిలీలు చేయించడానికి కాంగ్రెస్ లోని కొంత మంది ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. అవినీతి ఆరోపణలు ఉన్న పోలీసు అధికారులను మంచి మంచి పోస్టింగుల్లో కూర్చోబెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి .. ఈ విషయంలో ఆలోచన చేయాలి. ఎలాంటి ఆరోపణలు లేని పోలీసుల అధికారులపై మీ నాయకుల సిపారసు మేరకు బదిలి వేటు వేస్తే.. శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల నియోజకవర్గంలో ఓ రెడ్డి సాబ్.. దళిత సామాజిక వర్గం అధికారులపై కక్షకట్టి మరి పై అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఎస్సైలను, సిఐలను బదిలీలు చేయించి.. ఒక్క ఎస్సీ ఆఫీసర్ ఎస్‌హెచ్‌వోగా లేకుండా చేశాడని తెలిసింది.

**పోలీసు శాఖలో సామాజిక వర్గాల వారిగా పోస్టింగ్‌ల ప్రాధాన్యత ఉండటం బాధాకరం.**

తెలంగాణా రాష్ట్రంలో బదిలీలు అయిన పోలీసు అధికారులకు గత ఎనిమిది, తొమ్మిది నెలలుగా ఎక్కడ పోస్టింగ్‌లు ఇవ్వకుండా.. అనమాకంగా ఉంచారు. వీరికి కనీసం వేతనాలు కూడా రావడం లేదు. పోలీసు శాఖలో క్షేత్ర స్థాయిలో పోలీసు అధికారుల మంచి చెడులు , వారి సమస్యలపై హెూంశాఖ మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా చేయాల్సిన అవసరం ఉంది. సామాజిక వర్గాల వారిగా కాకుండా ప్రతిభ ఆధారంగా, వారి నిజాయితి ఆధారంగా పోస్టింగ్‌లు ఇస్తే బాగుంటుంది. గీసుకొండ లాంటి సంఘటనలు జరగకుండా సొంత పార్టీ నాయకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## యువకుల ప్రాణం తీసిన అతివేగం..

- **చెట్టును ఢీకొన్న బైక్.. ఇద్దరు మృతి ..**

**బలగం టీవీ, వేములవాడ**

అతివేగంతో చెట్టును బైక్ బలంగా ఢీకొనడంతో ఇద్దరి యువకులు మృతి చెందిన సంఘటన వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. హన్మాజీపేట గ్రామానికి చెందిన విక్కుర్తి దిలీప్ (22), సురా అనిల్ (21) ఇద్దరు స్నేహితులు. గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన దుర్గామాత నిమజ్జన వేడుకల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. దుర్గామాత నిమజ్జనం తర్వాత నూతనంగా కొనుగోలు చేసిన బైకుపై సరదాగా మామిడిపల్లి రహదారి వైపు వెళ్ళగా, అతివేగంతో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు..అటువైపుగా పెట్రోలింగ్ కు వచ్చిన పోలీసులు క్షతగాత్రులను తమ వాహనంలోనే వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించాగా,వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం పెద్ద ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మృతదేహాలను సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఇద్దరి యువకులు అర్థాంతరంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రుల రోదనలతో హన్మాజీపేట గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.



## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక..

**బలగం టీవీ, ముస్తాబాద్**

ముస్తాబాద్ మండల కేంద్రంలో మహర్షి పబ్లిక్ స్కూల్ ఉన్నత పాఠశాల లో ఏడవ తరగతి విద్యార్థి కొండం సాయి తేజ్ గౌడ్ ఈనెల 4 వతేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్ జి ఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 14 క్రికెట్ సెలెక్షన్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు పాఠశాల కరస్పాండెంట్ జలజ తెలిపారు.రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని కేకే మహేందర్ రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ చక్రధర్ రెడ్డి,గల్ఫ్ ఎన్ఆర్ఐ సెల్ తోట ధర్మేందర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు . జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత వాటిని పరిష్కరించాలని వివరించారు. దరఖాస్తుల పరిష్కారంలో జ్యాపం వద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో సిరిసిల్ల ఆర్డీవో రమేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



## బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం...

- **గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 16 ఫిర్యాదులు స్వీకరణ...**
- **ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ, సిరిసిల్ల :**

ప్రజల వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి ప్రతి పిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తామని ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని,అందులో భాగంగా నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జిదారుల నుండి 16 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు.గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు.

## వేములవాడ ఆలయం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



- **రాజన్న భక్తుల సౌకర్యార్థం అవసరమైన అన్ని వసతులు కల్పిస్తాం..**
- **యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయ అభివృద్ధికి చర్యలు..**
- **రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల :**

యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలో పర్యటించిన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ , ఎస్పీ అఖిల్ మహజన్ పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.

వేములవాడ రాజన్న ఆలయం అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి ఆలయంలోకి స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వాదం మధ్యలో మంత్రి స్వామివారి దర్శనం చేసుకుని కోడే మొక్కలు చెల్లించారు. రాజన్న దేవాలయం సన్నిధిలో మనవడి పుట్టి వెంట్రుకల కార్యక్రమాన్ని మంత్రి కుటుంబ సభ్యుల తో పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాజన్న దేవాలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, త్వరలోనే రాజన్న దేవాలయ అభివృద్ధి పై సీఎం స్థాయిలో అత్యున్నత సమావేశం జరుగుతుందని, శాస్త్రాల ప్రకారం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని అన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని రకాల వసతులను కల్పిస్తూ ఆలయ అభివృద్ధికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలవకుండా చర్యలు తీసుకున్నామని, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక



శ్రద్ధతో పనిచేస్తున్నారని అన్నారు.

యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, యాదాద్రి ఆలయానికి 63 కేజీల బంగారంతో తాపడం ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. వేములవాడ దేవాలయం వద్ద 65 కేజీల బంగారం 5000 కిలోల వెండి అందుబాటులో ఉందని వీటిని వినియోగించుకొని వేములవాడ ఆలయానికి సైతం బంగారు తాపడం, వెండితో పల్లకీలు, ఉత్సవ విగ్రహాలు రూపొందించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు .అనంతరం మంత్రి బద్ది పోచమ్మ ఆలయంలో అమ్మవారిని



# ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆర్థికశాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి వరించింది. రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ అవార్డును ప్రకటించింది. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన డారన్ ఏస్‌మోగ్లు, సిమన్ జాన్సన్, యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన జేమ్స్.ఎ.రోబిన్‌సన్‌లకు ఈ యేటి ఎకనామిక్స్ నోబెల్ దక్కింది. సమాజ శ్రేయస్సును నిర్ణయించడంలో సంస్థల పాత్రపై వీరు చేసిన అధ్యయనానికి గానూ నోబెల్ బహుమతి దక్కింది.

గతేడాది కూడా ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ పురస్కారం దక్కింది. బెన్ ఎస్ బెర్నాంకి, డగ్లస్ డబ్ల్యూ. డైమండ్, ఫిలిప్ హెచ్.దిబ్విగ్‌లు నోబెల్‌ను అందుకున్నారు. బ్యాంకులు, ఆర్థిక సంక్షోభాలపై ఈ ముగ్గురు పరిశోధనలు చేశారు. ఆర్థిక సంక్షోభాల వేళ బ్యాంకుల పాత్ర ఎంత ముఖ్యమైందన్న విషయాన్ని ఈ ముగ్గురూ తమ పరిశోధనల్లో వెల్లడించారు. బ్యాంకులు దివాళా తీయకుండా ఉండేందుకు ఈ స్టడీ చాలా కీలకమైందని నోబెల్ కమిటీ అభిప్రాయపడింది.

## గాంధీ మెడికల్ కళాశాలకు సాయిబాబాకు భౌతికకాయం

(మొదటి పేజీ తరువాయి)

హత్యగా అభివర్ణించారు. ఫ్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ%"% సాయిబాబాను కేంద్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి పదేండ్లు జైలులో చిత్ర హింసలకు గురిచేసిందని విమర్శించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడుతూ.. సాయిబాబాపై కేంద్రం అణచివేత ధోరణితో వ్యవహరించిందనీ, ఆయన మృతికి బిజెపి సర్కార్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన అట్టడుగు వర్గాల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి సాయిబాబా అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు రామచంద్రమూర్తి, అల్లం నారాయణ, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, మాజీ ఎంపీ మధుయాష్కి, విమలక్క, మాస్టర్‌జీ, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు, తదితరులు సాయిబాబాకు నివాళులర్పించారు. అంతకు ముందు గన్‌పార్కు వద్ద సిపిఐ నేత నారాయణ నివాళులర్పించారు. పదేండ్లు అన్యాయంగా జైల్లో నిర్బంధించారనీ, దోషి ఎవరో తేల్చాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తికి లేఖ రాస్తానని ఆయన చెప్పారు.

## సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు.

మాజీ మంత్రి తలసాని మాట్లాడుతూ.. మత విద్వేషాలను ప్రేరేపించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. నిన్నటి వరకు ఎంతో భక్తి శ్రద్ధలతో దుర్గామాత నవరాత్రులు, బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారని.. విగ్రహం ధ్వంసం చేయడం ఒక వర్గం మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. దోషులు ఎంతటివారైనా పోలీసులు కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మరోసారి డిమాండ్ చేశారు.

సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలోని అమ్మవారి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారనే విషయాన్ని తెలుసుకున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ నేత మాధవీలత, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ, టాస్క్‌ఫోర్స్ డీసీపీలు, అందె శ్రీనివాస్, సుధీంద్ర, చికోటి ప్రవీణ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ నాయకులు గజ్జెల నగేశ్, నివేదిత తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని ముంబైకి చెందిన సల్మాన్‌గా పోలీసులు గుర్తించినట్టు తెలిసింది.

**దేవాలయాలపై దాడులు దారుణం: కేంద్ర మంత్రి**

నగరంలో హిందూ దేవాలయాలపై వరుసగా దాడులు జరుగుతున్నాయని మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొంత మంది మతోన్మాదశక్తులు దాడులకు పాల్పడుతూ మత కల్లోలాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కొద్ది రోజుల్లోనే హైదరాబాద్ నగరంలో ఇది నాలుగో ఘటన అని గుర్తు చేశారు. మతి స్థిమితం లేని వారు హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్నారని పోలీసులు చెప్పడం సరి కాదన్నారు. దోషులు ఎంతటి వారైనా అరెస్ట్ చేసి, వారి వెనుక ఎవరి హస్తం ఉన్నదో గుర్తించాలని, వారిపైన కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవ హరించకపోతే దీన్ని ప్రభుత్వ కుట్రగా భావించాల్సి



వస్తుందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమ వారం రాత్రి ఆయన దేవాలయాన్ని సందర్శించి, అక్కడి పరిస్థితిని స్థానికులను, పోలీసులను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ దేవాలయాలపై దాడి జరిగిన ప్రతిసారి పిచ్చోడు చేశాడని చెప్పడం పోలీసులకు అనవాయితీగా మారిందన్నారు. రెండు వందల ఏండ్ల చరిత్ర ఉన్న అమ్మవారిని కాలుతో తన్ని ధ్వంసం చేయడం చూసి స్థానిక మహిళలు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. ఇంత జరిగినా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక్క మంత్రి కూడా రాలేదని, మాట్లాడలేదని విమర్శించారు.

ముత్యాలమ్మ ఆలయంలోకి అర్ధరాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ ఘటనను ఖండిస్తూ ట్వీట్ చేశారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై దాడి తీవ్రకలకలం రేపుతోందని పేర్కొన్నారు. ఇలాంటి తెలివితక్కువ చర్యలు హైదరాబాద్ నగర సహనశీలతకు మచ్చను తీసుకువస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని నెలలుగా శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

## కేటీఆర్ పిటిషన్‌పై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలంటూ 23 రకాల ఆధారాలను కెటిఆర్ న్యాయవాదులు కోర్టుకు సమర్పించారు. అలాగే బిఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌లను తన తరపు సాక్షులుగా పేర్కొన్నారు. కాగా అక్కినేని నాగచైతన్య, సమంత విడిపోవ డానికి మాజీ మంత్రి కేటీఆర్ కారణమంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్య లు ఎంతటి సంచలనాన్ని సృష్టించాయో అందరికీ తెలిసిందే.

అంతేకాకుండా కెటిఆర్‌ను ఉద్దేశించి మంత్రి అనేక కామెంట్స్ కూడా చేశారు. ఈ క్రమం లో కొండా సురేఖ వ్యాఖ్యలపై కెటిఆర్ కోర్టును ఆశ్ర యించారు. కొండా సురేఖపై నాంపల్లి స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేశారు. తనపై చేసిన వ్యా ఖ్యలు తన ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. కెటిఆర్ వేసిన పిటిషన్‌పై ఈనెల 10వ తేదీన విచారణ ప్రారంభమై సోమవారం నాటికి వాయిదా పడింది. మరోవైపు ఇదే కేసులో ఇప్పటికే మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ చర్య లు తీసుకోవాలని హీరో నాగార్జున పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా కోర్టుకు నాగార్జున వ్యక్తిగతంగా హాజరయ్యారు. మ రోవైపు నాగార్జున మేన కోడలు సుప్రియ కూడా ఈ కేసులో నాగార్జున తరుపున కోర్టుకు హాజరయి సాక్షిగా తన వాంగ్మూలం ఇచ్చారు. అలాగే నాగ్ కుటుంబ సభ్యులు కూడా కోర్టులో సాక్షి వాంగ్మూలం ఇచ్చిన సంగతి విదితమే.

## చార్జీలు పెంచలేదు

(మొదటి పేజీ తరువాయి)

సాధారణమని, ఉదాహరణకు ఒక ప్రయాణికుడు వెళ్లేటప్పుడు రెగ్యులర్ సర్వీసుల్లో ప్రయాణిస్తే సాధారణ టికెట్ ధరనే ఉంటుందని, అదే తిరుగుప్రయాణంలో స్పెషల్ బస్సును వినియోగించుకుంటే జీవో ప్రకారం సవరణ చార్జీలుంటాయని స్పష్టం చేశారు.ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుందని అన్నారు. అలాగే, ఆర్టీసీ సిబ్బంది కూడా స్పెషల్ బస్సుల్లో సవరించిన చార్జీలను టికెట్ జారీ సమయంలో ప్రయాణికుడికి తెలియజేయడం జరుగుతుందని వెల్లడించారు. పండగ సమయాల్లో మాత్రమే జీవో ప్రకారం స్పెషల్ సర్వీసుల్లో టికెట్ ధరలను సవరించడం జరుగుతుందని మరోసారి స్పష్టం చేశారు. సాధారణ రోజుల్లో యథావిధిగా సాధారణ టికెట్ ధరలే ఉంటాయని, స్పెషల్ సర్వీసులకు టికెట్ ధరలను సవరించడం సంస్థలో అనవాయితీగా వస్తోందని సజ్జనార్ పేర్కొన్నారు.

## జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ బెయిల్ పిటిషన్ ను రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్ట్ కొట్టివేసింది. తన అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ పై లైంగిక దాడి కేసులో జానీ మాస్టర్ అరెస్టయిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టులో మాస్టర్ తరపున లాయర్ పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు, బెయిల్ ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పింది. కేసు తీవ్రత.. బాధితురాలిని, సాక్షులను బెదిరించే అవకాశం ఉందన్న నార్సింగి పోలీసుల వాదనతో ఏకీభవించిన కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.

# పాకిస్థాన్‌పై కివీస్ విజయం

### కివీస్ సెమీస్‌కు.. భారత్ ఇంటికి




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా పాక్‌తో మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఘన విజయం సాధించింది. లోస్కోరింగ్ మ్యాచ్ లో తమ స్కోర్ ను అద్భుతంగా డిఫెండ్ చేసుకున్న కివీస్ పాక్ ను 56/10 కే అలౌట్ చేసి చిత్తుగా ఓడించింది. దీంతో సెమీస్ చేరాలన్న భారత్ ఆశలు కూడా గల్లంతయ్యాయి. ఈ విజయంతో గ్రూప్-ఎలోని న్యూజిలాండ్ సెమీస్‌కు దూసుకెళ్లగా ఆస్ట్రేలియా జట్టు ఇప్పటికే సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది.

మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కివీస్.. 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 110 పరుగులే చేయగలిగింది. సూజీ బేట్స్ (28) టాప్ స్కోరర్. పాక్ బౌలర్లలో నశ్రా సంధు (3/18) కివీస్‌ను కట్టడిచేసింది. కానీ స్వల్ప ఛేదనలో పాక్.. 11.4 ఓవర్లలో 54 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ ఫాతిమా సనా (21), ఓపెనర్ మునీబా అలీ (15) మినహా మిగిలినవారంతా సింగిల డిజిట్‌కే పరిమితమయ్యారు. అమేలియా కెర్ (3/14), ఎడెన్ కార్సన్ (2/7) పాక్ పనిపట్టారు. ఈ మ్యాచ్‌లో పాక్ ఓడటంతో టోర్నీ నుంచి భారత్ నిష్క్రమించింది.

# ఎమర్జింగ్ ఆసియా కప్‌కు భారత జట్టు ప్రకటన

## కెప్టెన్‌గా తెలుగు కుర్రాడు తిలక్‌వర్మ




**● 18 నుంచి టోర్నీ ప్రారంభం**

**బలగం టీవి, ముంబై**

ఒమన్ దేశంలో జరగనున్న ఎమర్జింగ్ ఆసియా కప్‌కు 15 మంది సభ్యులతో కూడిన భారత్‌-ఏ జట్టును బీసీసీఐ సోమవారం ప్రకటించింది. ఈ జట్టుకు తెలుగు కుర్రాడు తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ టోర్నీ ఈ నెల 18 నుంచి ప్రారంభం కానుంది. ఎమర్జింగ్ ఆసియా కప్ తొలిసారిగా ఈ ఏడాది టీ20 ఫార్మాట్‌లో జరుగుతోంది. ఇంతకు ముందు ఈ టోర్నమెంట్ 50 ఓవర్ల ఫార్మాట్‌లో మాత్రమే జరిగింది. తొలి ఎడిషన్ 2013లో భారత్ విజేతగా నిలవగా, పాకిస్థాన్ గత రెండు సార్లు టైటిల్‌ను గెలుచుకుంది. 2023లో పాకిస్థాన్ భారత్‌ను ఫైనల్‌లో ఓడించి విజేతగా నిలిచింది.

జట్టులో యువ ఆటగాళ్ల అభిషేక్ శర్మ, స్పిన్నర్ రాహుల్ చాహర్, ఆయుష్ బదోని , రమన్‌దీప్ సింగ్ , ప్రభ్‌సిమ్రాన్ సింగ్ , నేహాల్ వదేరా , నిశాంత్ సింధు, అనుజ్ రావత్‌లకు చోటు దక్కింది.

ఈ టోర్నీలో మొత్తం 8 జట్లు పోటీపడనున్నాయి. గ్రూప్‌-ఏలో అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, హాంగ్ కాంగ్, శ్రీలంక ఉన్నాయి. గ్రూప్‌-బీలో భారత్, ఒమన్, పాకిస్థాన్, యూఏఈ జట్లు ఉన్నాయి. గ్రూప్‌లలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు చేరుతాయి. అక్టోబర్ 25న సెమీస్, అక్టోబర్ 27న ఫైనల్ జరగనుంది.

ఆసియా కప్‌లో భారత్ తన తొలి మ్యాచ్‌లోనే పాకిస్థాన్ జట్టుతో తలపడనుంది. ఈ మ్యాచ్ అక్టోబర్ 19న జరగనుంది. భారత జట్టు అక్టోబర్ 21న యూఏఈతో రెండో మ్యాచ్ ఆడనుంది. కాగా లీగ్ దశలోని చివరి మ్యాచ్‌ను ఆతిథ్య దేశం ఒమన్‌తో ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లన్నీ ఒమన్ క్రికెట్ అకాడమీలో జరుగుతాయి.

**భారత్‌-ఏ జట్టు**

తిలక్ వర్మ (కెప్టెన్), అభిషేక్ శర్మ, ఆయుష్ బదోని, నిశాంత్ సింధు, అనుజ్ రావత్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, నేహాల్ వదేరా, అన్షుల్ కాంబోజ్, హృతిక్ షోకీన్, ఆకిబ్ ఖాన్, వైభవ్ అరోరా, రసిక్ సలామ్, సాయి కిశోర్, రాహుల్ చాహర్.

# తొలి టీ20 విండీస్ దే..



**బలగం టీవి, ముంబై**

శ్రీలంకతో మూడు టీ20ల సిరీస్‌లో వెస్టిండీస్ శుభారంభం చేసింది. దంబుల్లా వేదికగా జరిగిన తొలి వన్డేలో 5 వికెట్ల తేడాతో విండీస్ ఘన విజయం సాధించింది. 180 పరుగుల లక్ష్యాన్ని కరేబియన్ జట్టు 5 వికెట్లు కోల్పోయి 19.1 ఓవర్‌లో చేధించింది. దాంతో మూడు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది.

మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 179 పరుగులు చేసింది.కెప్టెన్ అసలంక (59, 35 బంతుల్లో, 9 ఫోర్లు), కామిందు మెండిస్ (51, 40 బంతుల్లో, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధశతకాలతో సత్తాచాటారు. అయితే టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లంకకు పేలవారంభం దక్కింది. 27 పరుగులకే ఓపెనర్లు నిస్సాంక (11, 10 బంతుల్లో, 2 ఫోర్లు), కుశాల్ మెండిస్ (19, 16 బంతుల్లో, 1 ఫోర్, 1 సిక్సర్) కోల్పోయింది. వన్‌డౌన్‌లో వచ్చిన కుశాల్ పెరీరా (6, 3 బంతుల్లో, 1 ఫోర్) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు.అనంతరం కామిందు మెండిస్, అసలంక నాలుగో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఓ స్థితిలో లంక 16 ఓవర్లకు 140/3తో మెరుగైన స్థితిలో ఉంది. కానీ వెస్టిండీస్ బౌలర్లు పుంజుకుని క్రమం తప్పకుండా వికెట్లు తీసి స్కోరు వేగాన్ని తగ్గించారు. షెఫర్డ్ రెండు వికెట్లు, మోటియ్, అల్జారీ జోసెఫ్, షామర్ జోసెఫ్, స్ప్రింగర్ తలో వికెట్ తీశారు.

అనంతరం ఛేదనలో వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (63, 33 బంతుల్లో, 11 ఫోర్లు, 1 సిక్సర్), ఎవిన్ లూయిస్ (50, 28 బంతుల్లో, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) చెలరేగారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 55 బంతుల్లో 107 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. చివరి 5 ఓవర్లకు 32 పరుగులు చేయాల్సి ఉండగా.. లంక బౌలర్లు ఆఖరి ఓవర్ వరకు మ్యాచ్‌ను తీసుకువచ్చారు. కానీ జట్టును గెలిపించలేకపోయారు. లంక బౌలర్లలో పతిరనా రెండు, కామిందు మెండిస్, హసరంగ, తీక్షణ తలో వికెట్ తీశారు.

# మెగాస్టార్ క్లాప్‌తో 'నాగబంధం' ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్**

"పెదకాపు" చిత్రంతో విరాట్ కర్ణ టాలీవుడ్‌లో హీరోగా పరిచయమైన సంగతి తెలిసిందే. తాజాగా, ఆయన నటిస్తున్న రెండో చిత్రం నాగబంధం : ది సీక్రెట్ ట్రెజర్. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ ఘనంగా ప్రారంభమైంది. డెవిల్ సినిమాకు దర్శకత్వం వహించిన పాపులర్ ప్రొడ్యూసర్ అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందనుంది. కిషోర్ అన్న పురెడ్డి నిర్మాణంలో, ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తున్నారు.

అయితే సినిమా ప్రారంభోత్సవ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ఆయన క్లాప్ ఇచ్చారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. అజయ్ భూపతి మొదటి షాట్‌కి దర్శకత్వం వహించాడు.పాన్ ఇండియన్ పౌరాణిక కథాంశంతో వస్తోన్న ఈ చిత్రాన్ని కొన్ని నెలల క్రితమే ప్రకటించారని తెలిసిందే. ఏషియన్ సునీల్ మేకర్స్‌కు స్క్రిప్ట్ అందజేశారు. ఈ చిత్రంలో జగపతి బాబు, జై ప్రకాష్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లక్ష్మీ ఇరా, దేవాన్ష్ నామా సమర్పణలో నిక్ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్‌పై కిషోర్ అన్నపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. తారక్ సినిమాస్ సహ నిర్మాతగా వ్యవహరిస్తోంది. అక్టోబర్ 23 తర్వాత రెగ్యులర్ షూటింగ్ షురూ కానుంది.




## ఆస్ట్రేలియా తమ అనుభవంతో పై చేయి సాధించింది

**● టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్**

**బలగం టీవి, దుబాయి**



మహిళల టీ20 ప్రపంచకప్ -2024 సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైన సంగతి తెలిసిందే. కాగా మ్యాచ్ అనంతరం ఓటమికి గల కారణాలను టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. ఆస్ట్రేలియా ఏ ఒక్కరిపై లేదా ఇద్దరిపై ఆధారపడదని, ఆసీస్ జట్టులో ఎంతోమంది ఆల్‌రౌండర్లు ఉన్నారని తెలిపింది. కానీ భారత జట్టు పరిస్థితి అలా కాదని చెప్పింది. అంతేగాక ఆస్ట్రేలియాలో అనుభవజ్ఞులు ఉన్నారని, వాళ్లు ఎన్నో ప్రపంచ కప్‌లు కలిసి ఆడారని పేర్కొంది. అయితే తమ జట్టు కూడా గొప్పగానే విజయం కోసం ప్రయత్నించిందని, ప్రత్యర్థి జట్టు అంత సులువుగా పరుగులు ఇవ్వలేదని చెప్పింది. రాధా గొప్పగా బౌలింగ్ చేసిందని, ఫీల్డింగ్‌లో కూడా సత్తాచాటిందని హర్మన్‌ప్రీత్ కొనియాడింది. ఛేదించదగిన లక్ష్యమే అని, కానీ దీప్తి, తాను సులువైన బంతుల్ని ఉపయోగించుకోలేదని తెలిపింది. అప్పటికీ మ్యాచ్‌ను గెలిచే అవకాశం తమకు ఉందని, కానీ ఆస్ట్రేలియా తమ అనుభవంతో పైచేయి సాధించిందని పేర్కొంది.

## 'కంగువా'కి ఏఐ సాయంతో డబ్బింగ్

**బలగం టీవి, హైదరాబాద**

హీరో సూర్య నటిస్తున్న చిత్రం 'కంగువా'. శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఫాంటసీ యాక్షన్ ఫిల్మ్‌గా రూపుదిద్దుకుంటున్నది. ఈ సినిమా నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. అయితే, తాజాగా ఈ చిత్రం గురించి నిర్మాత కేఈ జ్ఞానవేల్ ఓ ఇంట్రెస్టింగ్ విషయాన్ని చెప్పారు.తన పోస్ట్ లో రాసుకొస్తూ.. 'కంగువా' సినిమాను ఏకంగా 8 భాషల్లో ఒకేసారి రిలీజ్ చేయనున్నాం. అయితే, తమిళ వెర్షన్‌కు సూర్య డబ్బింగ్ చెప్పగా.. మిగతా భాషల్లో ఏఐ సాయంతో డబ్బింగ్ పనులు పూర్తిచేస్తున్నాం. డబ్బింగ్ పనుల కోసం కోలీవుడ్‌లో ఏఐని ఉపయోగించడం ఇదే మొదటిసారి. రీసెంట్ గా విడుదలైన 'వేట్టయన్'లో అమితాబ్ బచ్చన్ వాయిస్‌లో మార్పుల కోసం ఏఐను ఉపయోగించారు. ఇప్పుడు పూర్తిగా డబ్బింగ్ కోసం మేం దీన్ని ప్రయోగిస్తున్నాం. ఇది విజయవంతమవుతుందని భావిస్తున్నాం' అని నిర్మాత తన పోస్ట్ లో క్లారిటీ ఇచ్చారు.

## 'క' విడుదల తేదీ ఖరారు


**బలగం టీవి, హైదరాబాద్**




కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'క'. అక్టోబర్ 31, 2024న ఈ సినిమా థియేటర్స్ లోకి రానుందని మేకర్స్ ఇటీవల సోషల్ మీడియాలో ప్రకటించారు. ఇప్పుడు తాజాగా అదే విడుదల తేదీ అని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఈ సినిమా విడుదల కాబోతుంది.కాగా 'క' సినిమాలో కిరణ్ అబ్బవరం సరసన నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకం మీద చింతా గోపాలకృష్ణ రెడ్డి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు.

## డిసెంబర్ 20న 'యూఐ' విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**




కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'యూఐ'. ఉపేంద్ర కథనందిస్తూ.. డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రాన్ని మనోహరన్-శ్రీకాంత్ కేపి సంయుక్తంగా తెరకెక్కి స్తున్నారు. రీష్మా నానయ్య ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటి పోషిస్తోంది. ఈ చిత్రానికి కాంతార ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ మేరకు పోస్టర్ విడుదల చేశారు. పోనీ టెయిల్‌తో స్టైలిష్ గాగుల్స్ పెట్టుకున్న ఉపేంద్ర చేతిలో గన్ పట్టుకోగా.. బ్యాక్ డ్రాప్‌లో హెలికాప్టర్లు గమనించవచ్చు. ఈ చిత్రాన్ని కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ చిత్రాన్ని లహరి ఫిలిమ్స్, వీనస్ ఎంటర్‌టైనర్స్ సంయుక్త నిర్మాణంలో తెరకెక్కిస్తున్నారు.